కథానిక

# ఆచార్యులవారి శిక్ష

"పరంధామయ్య"

ఆచార్యులవారు మధ్యాహ్నపు విశ్రాంతి కోసం కుక్కిమంచం వాల్చి కాస్త నడుము వాల్చాడు. కొంచెం కునుకుబట్టింది కూడా. ఇంతలో కప్పువిరిగి మీదపడ్డట్టు వులిక్కిపడి లేచాడు. పైకి చూడటానికి తగిన సాహసం లేకపోయింది. దేహంవైపు చూచుకొన్నాడు. చెదలు పట్టి, శిథిలమైన తాటాకుమట్టలు పడి వున్నయి. "ఇదేం కొంపరా భగవంతుడా! కాస్త గాలివీస్తే కూలిపడే కప్పు. జడివానకేం నిలుస్తుంది" అనుమానంతో తల పైకెత్తాడు. ఛ-ఛ యింకా రాలుతున్నదేమో కళ్లనిండా ధూళిపడ్డది. రెండు చేతులతోను కళ్లు వులుముకుంటూ- మంచంమీదనుండి లేచాడు. "ఈ గోడలేంది. అన్నీ నెర్రిలే. వీటిలో తేళ్లు జెర్రులేకాదు, పాములు కూడా నిశ్చింతగా కాలక్షేపం చెయ్యవచ్చు. ఇంకా నయం. ఆడవాళ్లు కనటానికి పుట్టింటికి వెళ్ళారు. వాళ్ళే కనుక వచ్చివుంటే ఎంత ప్రమాదం" కాని యింతలో తోటి పంతులన్న మాట జ్ఞాపకం వచ్చింది. గ్రామంలో ఈ కొంప తప్ప వేరే గతి లేదని ఇంటిని చూచి పెదవి విరిచిన ఆచార్యులవారికి సమాధానంగా అతడన్నాడు. ధూళిపడని సురక్షిత ప్రదేశం ఎక్కడన్నా వున్నదేమో అన్వేషించ సాగాడు. నిన్న తాను యింట్లో చేరినపుడు శుభ్రంగా అలికివుంది యిల్లు. ఇంతలో గుట్టలు గుట్టలుగా యీ దుమ్మంతా ఏలా చేరగలిగిందా అని అతనికి ఆశ్చర్యంవేసింది. పైన కిసకిస చప్పుడు వినిపించింది. ధూళి వర్షపుజల్లువలె రాలటం ప్రారంభించింది. "ఎలుకలు కూడా. ఈవేళ రేపు తాళితే తేళ్లు పాములు కూడా కనబడవచ్చు. నాతోపాటి యీ సమస్త జీవరాసులు తల దాల్చుకోవాలసిందేనా?" ఆచార్లు ముఖంలో భయం కనబడ్డది. ఆలోచనలతో బరువెక్కిన అతని తల నిలవలేకపోయింది. మంచాన్ని తలుపు ముందుకు లాగి కూర్చున్నాడు. పంచవైపు చూశాడు. ఆరెరే కోళ్లు. మిట్టమధ్యాహ్నం ఆచార్యులవారి పంచను చుట్టుప్రక్కల కోళ్లు తమ ఆశ్రయంగా చేసుకొన్నై. ఆ క్షణంలోనే అతని కొక దృఢనమ్మకం ఏర్పడింది. ఏ మానవుడు కాని ఆ కొంపలో నివసించలేడని అనుకున్నాడు. లేచి కోళ్లను తోలాడు. పక్కింటి ఆసామిని పిల్చి ఇంతకు ముందెవరైనా ఈ యింట్లో వున్నారా? అని సందేహంగా అడిగాడు. "లేకేం వున్నారు. మీముందున్న పంతులు ఆయనికి ముందున్న పంతులు కూడా యీ యింట్లోనే వుంట."

బడిలో ఆస్థానానికి ఎవరొచ్చినా యీ గృహమే శరణ్యం కాబోలనుకున్నాడు ఆచార్లు. ఇంటి కప్పులవైపు గోడలవైపు తీక్షణంగా చూస్తూ ఇంతకంటె గత్యంతరం లేదు కాబోలుననుకొని మంచంపై వాలాడు. కళ్లు మూసుకొని గతాన్నంతా పైకి తోడసాగాడు. "జిల్లాబోర్డుఆఫీసుచుట్టూతిరిగాను కాళ్ళరిగేట్టు. కనబడ్డ డి. బి. యమ్‌కల్లా మొరపెట్టుకున్నాను, బహు కుటుంబీకుడిని, రెండు సంసారాలు నిర్వహించలేక నానా యాతన పడుతున్నాను. తమ్ముళ్ళు చదువుకుంటున్నారు. స్వంత వూళ్ళో హైస్కూలువుంది, యిల్లువుంది, అందరం ఒకచోట పడివుండే పొదుపరితనంగా కుటుంబాన్ని నెట్టుకపోవచ్చు, యింటి అద్దెకూడా మిగులుతుంది. నన్ను కాస్త దయతో చూడండి అంటూ కాళ్ళ వేళ్ళ బడ్డాను. కాని అదేం కర్మో స్వంతవూరికి ట్రాన్సుఫరు కోరుకుంటే— యిట్టనా నీపని అన్నట్టు- యింత అరణ్యంలో తెచ్చి పడేశారు. ఇంతకూ దుష్టగ్రహాలు నెత్తినెక్కి కూర్చున్నయి. మనిషి కనబడితే కాని వాళ్ళకు గ్నాపకం వుండదు. ఇదేంటయ్యా యీ అన్యాయం? నేను కోరిందేమిటి మీరు చేసిందేమిటి? అని మొహమాటం లేకుండా

అడుగుతాడుని వ్రాయ్యాను. కాని నోటినుంచి మాటవస్తేగా! మాట తడబడింది. కాళ్ళు వణికినవి. ముచ్చెమటలు పోసినై. వెధవబెదరు. నాదరిద్రానికి దగ్గట్టే కుదిరింది వొబీడియన్న చూపడంకోసం కొన్నాళ్లు పని చేయాలట. ఎంత అమూల్యమైన సదుపదేశం! ఇంతకు ఏం తేలింది. మనకు వొరిగిందేమీ లేకపోగా పది రూపాయలు ఖర్చైంది. ఆడవాళ్ళు కొంపలో లేకపోబట్టి సరిపోయింది. లేకపోతే వాళ్ళు వేసే ప్రశ్నలకి జవాబుచెప్పలేక నాతాడు తెగేది. ఛా-ఛా! ఎందుకీ బ్రతుకు? ఏం సాధిస్తున్నాం బ్రతికి? అఖరికి కట్టుకున్న భార్యైనా కొంచెం సానుభూతి చూపకూడదూ? చూపదు. ఎవ్వరికీ మనమీద జాలిలేదు. పైగా యీ గ్రహాలపీడను దురదృష్టాన్ని అసమర్థత క్రింద జమకట్టి చులకనగా జూస్తారు. మానని గాయాన్ని రేపుతారు. ఇదేనా జీవితం? జీవితమంటే వుత్త బాధ. యింకేమీ లేదూ?" ఆచార్యులవారు తత్త్వంలో పడ్డారు.

అయితే మన పవిత్ర భారతదేశంలో దరిద్రాన్ని నిరసించటం అందులోను దానికి వారసులైనవారు తత్త్వ విమర్శల్లో పడటమూ ఏ మాత్రం క్షంతవ్యం కాదు. ఒకొక్కప్పుడవి గృహచ్ఛిద్రము మొదలైన భీభత్సాలు కలిగించనూవచ్చు, లేక ఈ వుత్తమ సమాజ వ్యవస్థపై తిరుగుబాటు చేసే ద్రోహ చింతనైనా కలిగించవచ్చు కాని అలాంటి భయం మన కనవసరం. అతని తత్త్వవిమర్శ ఒక నిర్ణీతరూపం దాల్చకముందే వీపుపై తాటాకుమంట బెట్టినట్టు- చివుక్కున లేచి, "నల్లులు కూడా" అనుకొని చేతితో మంచాన్ని గట్టిగా తట్టడం ప్రారంభించాడు. పంతులుగారు నేలమీద పడుండటం యిష్టంలేని సజ్జనుడొకడు ఆ మంచాన్ని ఆచార్యులవారికి పదిరోజులు వాడుకోటానికి యిచ్చాడు. చింతగింజలవలె వున్న రెండు మూడు నల్లులు నేలమీదపడి పరుగెత్తసాగినై. ఆచార్యులు తనభారమైన శరీరాన్ని విల్లనంబు వంచినట్టు వంచి తన రక్తాన్ని పీల్చి బాగాబలిసిన ఆ నల్లుల్ని పట్టి చంపి తన కసి తీర్చుకున్నాడు. మంచాన్ని బైటికిలాగి పడేసి


# "స్వతంత్ర"

## ఇంగ్లీషు, తెలుగు, వార పత్రికలు

## చిరునామా మార్పు

"స్వతంత్ర" కార్యాలయం 160, లాయిడ్స్ రోడ్డు, రాయపేట నుండి మార్చబడింది.

కొత్త చిరునామా :

**"స్వతంత్ర"**

2, బ్రాడీస్ రోడ్డు, మైలాపూరు, మద్రాసు-4

టెలిగ్రాం : "స్వతంత్ర", మద్రాసు. టెలిఫోన్ : 8177

—"ఓయి భగవంతుడా యీ అల్పప్రాణినిపై దాడికి ఎన్ని జీవజంతువుల సన్నాహపరచావో! నేను నీకేం అపచారం చేశాను. కనికరించు మహాప్రభూ—" భక్తితో కన్నీళ్లు పెట్టుకుంటూ లెంపలు వాయించుకున్నాడు.

కొత్తయిల్లు. అందులోనూ ఆనాటి మధ్యాహ్నం అన్ని అమానుష సంఘటనలు జరిగిన అనంతరం ఆచార్యులకు ఆ యింటిలో ఆ రాత్రి ఒంటరిగా పడుండటం మనస్కరించలేదు. ఇద్దరు పిల్లల్ని తోడు తెచ్చుకున్నాడు.

ఆచార్యులు శిష్యుల సహాయంతో పంచ అంతా శుభ్రంగా చిమ్మించాడు. పక్కలువేసి లాంతరు తగ్గించి పడుకున్నాడు. ఏదో కంపు కొడుతూంది కోడిపెంట కాబోలనుకున్నాడు ఆచార్యులు. కొత్తచోటు కాబట్టిన్నీ మనస్సంతా కలతజెంది వుండటంవల్లా పొద్దుపోయిందాకా అతనికి నిద్రపట్టలేదు. అటుయిటూ పొర్లుతూ నిద్రకోసం తాపత్రయ పడుతూవున్నాడు. ఇంతలో కాళ్లు చురుక్కుమన్నాయి. పక్కపై కాళ్ళేసి రుద్దుతూ నల్లులేమన్నా వున్నాయేమో లాంతరు తెచ్చి చూశాడు. నల్లులు కనబడలేదు. లాంతరు తగ్గించి యథాస్థానంలో వుంచి మరలా పడుకొన్నాడు. కాళ్ళే కాదు చేతులకూడా చుర్రుమంటున్నాయి. కూనిరాగాలు కూడా ప్రారంభమైనాయి. "దోమలుకూడా—" ఆచార్యులు షాక్ కొట్టినట్టు ఆవేశంపొంది ఆపాదమస్తకం దుప్పటి కప్పుకొన్నాడు. "క్వైనైన్ మ్రింగే దురదృష్టం పట్టకుండా కాపాడు భగవంతుడా"—అని దేవుణ్ణి వేడుకున్నాడు.

దినాలు గడిచిపోతున్నాయి. ఆగృహంలో ప్రతిరోజూ ఏదో ఒక భయంకర సంఘటన జరుగుతూనే వుంది. ఒకరోజు తేలు కనబడింది. మరోరోజు పాము కుబుసం గోడకు వ్రేలాడుతూ వుండింది. ఒకరాత్రి పందికొక్కు వచ్చి ఇంటిలో నానాహంగామా చేసింది. ప్రతిరోజూ పిల్లులు ఎలుకలు చేసే కోలాహలం చెప్పనక్కరలేదు ఇట్లుండగా ఇంకో ఘోరం జరిగిపోయింది. ఆచార్యులవారికి రెగ్యులర్ గా ప్రతివారమూ భార్యవద్దనుంచి వచ్చే జాబు ఆవారం రాలేదు అతడు చాలా డిస్సపాయింటై పోస్టు బ్యాగులో చెయ్యిపెట్టి గాలికాడు. సార్టింగు పొరబాటుంటుందని మూల్గాడు. ఇంటికి వచ్చి గ్లాసుడు మంచినీళ్లు త్రాగి మంచానికి అడ్డంపడి పోస్టల్ డిపార్టుమెంటును శాపనార్థాలు పెట్టసాగాడు. మరునాడు జాబు రానేవచ్చింది రెండు మూడు పోస్టాఫీసుల ముద్రలు తగిలించుకొని అడ్రసు చూచాడు. బాగానేవుంది. కాని యీ పొరబాటు తన గ్రహపాటనుకున్నాడు. ఈ మధ్య ఒక జ్యోతిష్కుడు రెండు మూడు నెలలు పోతేగాని ఆచార్యులవారికి శని తొలగదన్నాడట. కుర్చీలో కూర్చొని ఆతురతతో జూచి చదువసాగాడు. భార్య ప్రసవించిందట. మొగపిల్లవాడు. తల్లి బిడ్డ సుఖంగా వున్నారు. అయితే దుష్టనక్షత్రం. శాంతి జేయాలి. వచ్చే శనివారం తప్పక రావాలి. తప్పక అనేచోట అండర్ లైను చేసివుంది. దానిక్రింద తన భార్య వ్రాసిన అక్షరాలు కనపడ్డాయి. "శాంతికి ముప్ఫయి రూపాయలవుతవి. కనీసం యిరవై అన్నా పట్టుకు రండి. ఇక్కడా వున్నకొంప కాదని మీకు తెలుసుగా?" ఆచార్యుల గుండె గతుక్కుమంది. చేతిలో దమ్మిడీలేదు వూరికి పోవాలి అతడు ఘోరమైన ఆలోచనలలో పడిపోయాడు అప్పు. అప్పు ఎవరిస్తారు? అణా వడ్డీ? కుదవ బెట్టి తీర్చేదెట్లా? అప్పిచ్చిన వాళ్ళంతా ఒక్కసారి భయంకరాకారంతో అతనిముందు ప్రత్యక్షమైనట్టు ఊహించి భయంతో వణికాడు. అంగడివాడు, పాలమనిషి, యిల్లిచ్చిన పెద్దమనిషి, వాళ్లు పెట్టే చీవాట్లు చెవుల్లో గింగురు మంటున్నాయి. జీతాలొస్తాయ్ త్వరలోనే కాని యెవరికని యిస్తావ్? శాంతికి డబ్బెట్లా? ఆచార్యులవారు బాగా అలసిపోయాడు. ఇంటికిపోయి మంచానికి అడ్డంగా పడ్డాడు. ఎవర్నడుగుదాం-? ఎవరిస్తారూ? శాంతికి డబ్బు ఖర్చుబెడితే అప్పుడు వాళ్లు బతకనిస్తారు? అబ్బా! కాలు చుర్రుమంది. ఆచార్యులవారు తల్లడిల్లి తల పైకెత్తి కాలువైపు చూశాడు. కాలు గీకుతూంది ఎలుక. భయంతో కాలు జాడించి చేతిలోవున్న పుస్తకాన్ని దానిపై విసిరాడు. జిత్తులమారి ఎలుక-అడ్డ గోడపై ఎక్కి తిరుచూర్ణం డబ్బాను దొర్లించి తాటాకు కప్పులో అదృశ్యమైంది.